
# కలిసిరాని జీవితం

శ్రీసుభా



ప్రభాకరం జీవితంలో సుఖపడతాడని నేనెప్పుడూ అనుకోలేదు. అది పదేళ్ళనాడు నాకు తెలిసిన విషయమే. యీనాడు అతను అంత చిత్తుగా వోడిపోయాడని తెలిసినరోజున చాలా మందిలా నేనూ బాధపడ్డాను. అతనికి ప్రత్యక్ష పరోక్షాల్లో సానుభూతి సరఫరా చేశాను. యెటొచ్చినా ఆవేదన - నా అంతరంగంలో ప్రభాకరం పట్లవున్న అభిప్రాయాల్ని - అతను తెలుసుకోనట్టే చాలామందీ తెలుసుకోలేదు ... అందుకే కొంతమందికి నేను రాక్షసుడిగా కన్పించాను. కొంతమంది వచ్చి "అతనిలా అవుతాడని తెలిసినరోజున యెందుకు సరిదిద్దలేదు. మాకు తెలుసు. ప్రభాకరంపతనం నీకు వో ప్రయిడ్ యిస్తుంది ... నువ్వూహించి

నట్టు జరిగిందన్న సంతోషం తప్ప - నువ్వు ఆశించని ఆనందాలు ఆకట్టుకో లేకపోయాడని 'సింపతీ' లేదన్నారు... యీ మాటే ప్రభాకరంతో కూడా అనుండొచ్చు - నాకు తెలుసు...

వాళ్ళ మాటల్ని నమ్మడం నమ్మకపోవడం కాదు నాకు కావల్సింది... ఫలితం విషవంతం అయినప్పుడు గతాన్ని నెమరు వేసుకోవడం - దాన్నే అమృతమయంగా చిత్రించుకోవడం నిరాశావాదుల లక్షణం. కానీ యిలాంటి అవకాశంతో కొండంత సానుభూతి వెదజల్లే యీ మిత్రమండలి-బంధుకోటి ఆ రోజు యేమయ్యారనేదే నా ప్రశ్న.

మనిషి అన్ని విధాలా అడుగంటిపోయి లేవలేకుండా పడివున్న సమయంలో - యీ వోదార్పు - అవివేకుల అధికమన్ననలను పొందుతుందేమో తప్ప - కనీసం వెనుతిరిగి చూసేవారికి, కళ్ళార్పకుండా మెదడునిండుగా ఆలోచించేవారికి నిజం తెలియకపోదు...

ప్రభాకరాన్ని నేను శాపగ్రస్తుడు అన్నాను...కాదు చూడ్డానికి అందంగా వున్నా మీట నొక్కితేగాని - అదీ - యెవరో ఆడిస్తే ఆడే బొమ్మ అంది శారద. అదీ కాదు అవివేకి అన్నాడు రమణమూర్తి.

ప్రభాకరం మిడిల్ స్కూల్‌నుంచి నాకూ, మూర్తికీ క్లాస్‌మేట్. ముగ్గురూ వొకే బెంచీమీద కూర్చునేవాళ్ళం. కానీ మా మధ్య యెప్పుడూ పొత్తులేదు ... దూరంగా కూర్చుని నాతోపాటు చదువుతూ వచ్చిన శారద - నాకు భార్యగా మారి దగ్గరయింది తప్ప - ప్రభాకరం పక్కనేవున్నా మా మధ్య - యోచనల్లో యోజనాలదూరం వుండేది. చిన్నప్పటి నుంచీ వాడి తరహా మాకు ఆశ్చర్యజనితంతోబాటు ఆలోచనల్ని రేకెత్తించేదిగానే వుండేది...

హడావిడిలో హోమ్‌వర్కు చేసుకురాకుండా స్కూలుకువెళ్ళి "ప్రభాకరం నీ నోట్స్ వోసారి యివ్వు-అవి పూర్తి చెయ్యకపోతే బెంచీ యెక్కిస్తారు మేష్టారు" అంటే సుతరాము యిచ్చేవాడు కాదు...

"ఆమాత్రం లెఖ్ఖలు చెయ్యలేనివాడివి - బెంచీ యెక్కు-ఫరవాలేదు" అనేవాడు...పైగా...మాకు దెబ్బలు తగిలి బాధపడుతుంటే నవ్వేవాడు. ఆ వేళ శారద జడలోపెట్టుకువచ్చిన నాగరం పారేసుకుంది...ఆ అమ్మాయి ఆ రోజు పడ్డ ఆందోళన యీ రోజు వరకూ గుర్తుకు తెచ్చుకుంటే నవ్వుతెప్పిస్తూనే వుంటుంది యిద్దరికీ.

కానీ అదృష్టవశాత్తు అది ప్రభాకరానికి దొరికింది. అదీ వాడే చెప్పాడు... మేం శారదకు చెప్పాం. ఆ అమ్మాయి చెయ్యి జాపింది...

''గంతులేస్తూ తిరిగినందుకు శాస్తి అయింది...నాగరం నీకివ్వను, మీ మామయ్యగారికిస్తాను'' అన్నాడు కోపంగా.

మామయ్య పేరు వినగానే వణికింది శారద...వాళ్ళ మామయ్య చండశాసనుడు. చదువు రావాలంటే రోజుకో బెత్తం విరగాలనే — పొరపాటు తిరిగి చెయ్యకుండా వుండాలంటే వో అరగంట గోడకుర్చీ వేయాలనేదీ ఆయన మనో న్యాయ శాస్త్రంలో వ్రాసుకున్న తీర్పు. ప్రభాకరం యెవరు బ్రతిమాలినా ఆ నాగరం శారదకు యివ్వలేదు......ఆ అమ్మాయి దణ్ణాలు పెట్టినా యింటిదగ్గర దెబ్బలు తప్పాలేదు...

యివన్నీ చెప్పడంలో — అతనిలో వున్న కటుత్వం చిత్రించాలనేది నా ప్రవృత్తికాదు...నిజానికి ప్రభాకరం పెరిగిన వాతావరణం అటువంటిది... హైస్కూల్‌కు మారే రోజుకు అతని పరిస్థితులుకూడా మారిపోయాయి...

ఆరోజునాటికి అతనికి మిగిలింది విధవ తల్లి — రెండువేల రూపాయల అప్పు...వో ఎకరం మెట్టభూమి... కర్కోటకుడైన మామయ్య శర్మగారూ— ఆయన నిర్మించిన నరక సాదృశ్యమయిన యిల్లు...

ప్రభాకరం తరువాత చదువుకని — ముందే ఆయన నోటు వ్రాయించుకున్నాడు...ఆయనకో కూతురువుంది.. ఆ అమ్మాయి బాగుండదంటారు చాలా మంది...చాలావరకూ తండ్రి పోలికలే.. పేరు సుభద్ర...తల్లి చనిపోయిందనే వుద్దేశంతో — ఆవిడ గుణగణాలు గుర్తుకు తీసుకోవడ మెందుకని అన్నీ తండ్రి బుద్ధులే నేర్చుకుంది...అలవర్చుకుంటోంది...

యీ విషయాలన్నీ నాకు తెలియడానికి కారణం ప్రభాకరం వోవిధంగా నాకు దూరపు బంధువవడమే. సూరమ్మగారు రమ్మనమంటేనూ — మా పక్కిల్లే అవడంచేతా చాలా విషయాలు ఆసక్తి లేకపోయినా తెలుస్తూ వుండేవి...

కాలేజీలో చేరినప్పుడు ప్రభాకరం మాతోపాటు ఆర్ట్స్ గ్రూప్ తీసుకుంటానంటే 'మావాడ్ని యింజనీరు చేస్తానని' అతనిచేత సైన్స్ గ్రూప్ కళ్ళెర్రజేసి వ్రాయించాడు...ప్రభాకరానికి అది యిష్టం లేదని మా అందరికీ తెలిసిందే..

అందరం ఆ ఏడాది చివరన సౌత్ యిండియా టూర్ యేర్పాటు చేసుకున్నాం. ప్రభాకరం కూడా మాతో రావడానికి యిష్టపడ్డం ఆ ప్రయాణంలో వో ప్రత్యేకత. నేను వాళ్ళింటికి వెళ్ళేసరికి ..."చదువుకోకుండా యీ తిరుగుళ్ళేమిటి అనవసరంగా'' శర్మగారు కటువుగానే అన్నారు లోపలికి వెళ్ళిపోతూ.

"మీరు చెప్పండి పిన్నిగారూ" అన్నాను నవ్వుతూ..మరో దారి లేక తల్లివైపు చూశాడు ప్రభాకరం.

"వెళ్లకపోతే యేరా మామయ్య కోప్పడుతుంటే" అంది ఆవిడ.

"అదికాదత్తయ్యా - పాపం ఆడపిల్లలుకూడా వస్తారు. బావ మనస్సుకి తోచిపోతుంది. యిక్కడేముంది? మన మొహాలేగా!" అంది సుభద్ర.

అంతే కొంచెం సేపటికి అక్కడ ప్రభాకరం లేడు. సుభద్ర లేదు. సూరమ్మగారూ లేరు. నేనే మిగిలాను.

యిలా చాలా విషయాల్లో అతన్ని యెవరో వొకరు జయిస్తూనే వచ్చారు. ఇంటరు పాసయిన రోజున శర్మగారు అతన్ని యింజినీరింగ్‌కు పంపించ లేదు. ఓ పంచవర్ష ప్రణాళిక వరకూ పెట్టుబడి పెట్టలేనని బి. ఏ. లో జేర్పించారు, అప్పుళ్లోనే.

అక్కడితో మా జీవితాలు విడిపోయాయి. నేను విశాఖపట్టణం - రమణమూర్తి కాకినాడలో బ్రతుకుబాటమీద వున్న కంకరరాళ్లు నలగ్గొట్టుకుంటూ భవిష్యత్ నిర్మాణంలో నిమగ్నులవుతున్నాం.

ఓ వుత్తరంలో రమణమూర్తి ప్రభాకరం గురించి విపులంగా కాకపోయినా యధాలాపంగా వ్రాసిన విషయం నాకు యీ రోజు గుర్తుకు వస్తోంది.


"వాడ్ని బెజవాడలో యీ మధ్య కలుసుకున్నాను. వాడు చాలా మారిపోయాడు. అందుకే సాదాగా అన్నాను. "యిదేమిటిరా యే ఆనర్సులో జేరినా బాగుండేది. యింజినీరును చేస్తానన్న మీ మామయ్య నిన్ను గుమాస్తామరలో ఆడించేస్తున్నాడేం" అని. దానికి వాడేం సమాధానం చెప్పాడో తెలుసా.

"మీ రందరూ వూహించిన విధంగానే భవిష్యత్తులో సుఖపడతారని నమ్మకం యేముంది. బ్రతకడంలో చిన్నా పెద్దా కొలతలు లేవు. నాకు మీరేం 'పిటీ' చూపించనఖ్ఖరలేదు"...నే నేదో చెప్పాలనుకునే లోపునే అనేశాడు.

"మా మామయ్య యిష్టంమీద నేనీ చదువు కొనసాగిస్తున్నానని మీరేం భ్రమపడకండి. నాకూ వ్యక్తిత్వం అంటూ వుంది" అని వెళ్ళిపోయాడు. వాడి ధోరణి నాకర్థం కాలేదు. మాట్లాడుతుంటే షివర్ అవడం, మొహం కందగడ్డలా అయిపోయి యెదటి మొహాల్లోకి చూడలేకపోవడం.

నేను ఫైనల్ యియర్ వచ్చేనాటికే శారద నా స్నేహితురాలి బిరుదు వదిలి జీవిత భాగస్వామి కావడం జరిగింది...

ప్రభాకరం పెళ్ళి జరిగినట్టు - అదీ - ఆ శుభకార్యం అయిపోయిన తర్వాత తెలిసింది ... తెలియజెయ్యడానికి అవకాశం లేదని - పెళ్ళి తిరుపతికొండమీద జరి



"ఆ మోటారుకారు వెంట పోనివ్వు."

గింది – క్షమించమని వుత్తరం మాత్రం వో నెల తరువాత ... ఆ వార్త నాకు ఆశ్చర్యాన్నివ్వలేదు...బాధా పెట్టలేదు... రమణమూర్తిమాత్రం 'తనకు పెళ్ళివార్త తెలుసున్నాగానీ ఆహ్వానం అందక వెళ్ళ లేదని' నాకు వుత్తరం వ్రాశాడు...నిజానికి రమణమూర్తి పెళ్ళికి నేను వెళ్ళలేకపోయాను...దానికి సరైన కారణం మా యిద్దరికీకూడా తెలియదు ... వెళ్ళే ముందే దగ్గరబంధువులు చనిపోవడం – ప్రయాణం కాస్తా 'గ్రీటింగ్'గా మారిపోయింది.

*   *   *

మా మరదలు పెళ్ళిలో అనుకుంటాను...నేనూ, మూర్తీ, ప్రభాకరం అనుకోకుండా కల్సుకున్నాం ... రెండేళ్ళ తరువాత కల్సుకున్నామేమో ప్రపంచంలో మూడోవంతు కబుర్లలో ప్రవహించింది...

ముగ్గురూ కాఫీలు తాగుతున్నాం – ఆలోచిస్తూ కూర్చున్నాడంటే మూర్తిని పట్టలేమని నాకు తెలుసు...వాస్తవానికి కొంచెం యెత్తుగా విహంగం కావడం– లేకపోతే జీవిత పొరల్లోకి వెళ్ళి, గాలించి, దొరికిన వస్తుసముదాయాల్ని తీసుకుని ఆర్కియాలజీ డిపార్ట్మెంటు వాళ్ళలా ప్రతీ సంఘటననీ తణిఖీ

చెయ్యటం-మా చేత చేయించడం అదో అలవాటు...

"యేమిటిరా ఆలోచిస్తున్నావు."

వాడు తేరుకున్నాడు ... చిన్నరకం నవ్వు నవ్వాడు ... నోటిలో సిగరెట్ యెవరో పీలుస్తోన్నట్టుగా తలూపింది... పొగ సిగ్గు అభినయిస్తున్న ప్రేయసిలా వంకీలు తిరిగిపోతోంది...

"ప్రభాకరం నాకో సలహా కావాలోయ్..." అన్నాడు. నేను వాడ్ని చూశాను. వాడు నన్ను దృష్టి లోకి రానివ్వలేదు...

"నేనా" అన్నాడు ... ఆశ్చర్యంగా తిరిగి ... "మామూలురకం సలహాలు నేనివ్వలేను...నేయిచ్చిన సలహాలు నీకు నచ్చకపోవచ్చు."

"ఫరవాలేదు..."

"హైస్కూల్లో మన క్లాస్ మేట్ కల్పవల్లి నీకు గుర్తుంది అనుకుంటాను...సన్నంగా పొడుగ్గా వుండేది... నవ్వితే బుగ్గల్లో సొట్టలు పడేవి...కంఠం కింద పెద్దసైజు పుట్టుమచ్చ...''

"యెవరయితే నేంలే...వర్ణన యెందుకు...కానివ్వు..."

"ఆ అమ్మాయిది మావూరే ... మా పక్కింట్లేకూడానూ...పెళ్ళి కుదిరిందనుకున్నారు అందరూ...బి.ఏ. ప్యాసయిన అమ్మాయికి పెళ్ళి కుదరడంలో ఆశ్చర్యం వుందా అనుకున్నాను నేను..."నవ్వేడు..

"కానీ జరిగిందేమిటో తెలుసా - వారం తరువాతి మధ్యాహ్నం ఆ అమ్మాయి మా యింటికి వచ్చింది ... చెల్లాయికోసం వచ్చిందని నేననుకున్నాను...కాదు నా కోసం వచ్చానని ఆ అమ్మాయి చెప్పింది ... కాదులే ... నవ్వింది...''

''నీగురించే కల్పవల్లి వచ్చానని చెప్పిందా..."

"అవును పదిసార్లు చూశాను... కల్పవల్లే..."

ఆ అమ్మాయి గురించి క్షణం ఆలోచించాను. కళ్ళల్లోకి అరక్షణం చూశాను.. ఆ నయనాల వెనుక ఆకలి చేస్తున్న అలజడి – శరీరంలో రేగే వుద్వేగం గుండెలమీదుగా బహిర్గతం కావడం. మత్తెక్కిన పెదాలగుండా వుక్కిరిబిక్కిరి అయి శకలాలుగా బయల్పడే మాటలు...

స్త్రీని కళ్ళతో మాత్రమే చూసి – వూహామాత్రమే తెలిసిన నేను ఆనాడు కల్పవల్లిపట్ల చాలా మూర్ఖంగా ప్రవర్తించాను...ఆమె కన్నీటికి విలువ యివ్వాలనిపించలేదు...నాలుగైదు రోజుల్లో మరొకతని భార్య కాబోతున్న ఆడది నన్ను వరించాననడం అనూహ్యమయినా – ఆమె అంతర్యంలో దాగిన నైరాశ్యపు పుంఖాన్ని – కన్నీటి బిందువులో కదులాడే అశాంతి అణువులు

నా శారీరిక వూహ అందుకోలేక పోయింది...

"నాకు తెలుసు...వారం రోజుల్లో పెళ్ళి అవబోతోందని. కానీ నా కాపెళ్ళి యిష్టంలేదు...'' యింకా చెప్పాలనుకున్నా. ఆగి నాలోకి చూసింది...

''అందర్నీ కాదని నాలో యేం చూసి వచ్చావో నాకు తెలుసు...కానీ నువ్వు చాలా పొరపాటు చేశావు.''

"నాకు కావల్సిన వస్తువును – నేను పొందా లనుకుని రావడం తెలివితక్కువతనం యెలా అవుతుంది..."

నేను చాలా తేలిగ్గా నవ్వేశాను...

''ప్రేమించానని వచ్చిన ఆడది అలుసని నాకు తెలుసు మూర్తిగారూ. కానీ ప్రేమించని మనిషితో ఆత్మవంచన చేసుకుని కాపురం చెయ్యడం మంచిపనవుతుందా..." తిరుగ ప్రశ్న వేసింది...

''అదే నేనూ అడుగుతూంటా. వయసు కప్పిన ఆవేశంతో – నేడో రేపో పెళ్ళి చెయ్యగలమని హాస నిట్టూర్పులు విడుస్తున్న తల్లిదండ్రుల్ని – స్మృతుల్లో స్రుతులు కలుపుకుంటున్న భర్తని – యింతమందిని – ఆఖరి క్షణంలోకూడా త్యజించగల్గిన నేర్పు ఆడవారికుంటుందా అనే సంశయాన్ని పచ్చి నిజం చెయ్యకు...అయినా నా చుట్టూతా వున్న యీ చిన్ని పరిధిలోంచి నీకేం యివ్వలే ననిపిస్తోంది... ''

"మూర్తిగారూ" ఆమె యేడుస్తోంది. చప్పుడు కాకుండా తలుపులు మూయాలనే వ్యర్థ ప్రయత్నంలా వుంది...... పెదాలతో ఆపుకోవడం చూస్తే...

"అవకాశం వచ్చినప్పుడు కోరివచ్చిన ఆడదాన్ని అనుభవించకుండా వదిలే మగవాళ్ళు చాలా తక్కువమంది వుంటారు...కానీ అవకాశం కాస్తాయిచ్చి ఆ తరువాత–పురుషుణ్ణి నిందించేటట్టుగా– ఆ జాతినే మోసపు ముద్దగా చిత్రించేటట్టుగా ప్రవర్తించిన స్త్రీ జాతి–పోగొట్టుకున్నది జీవితంనుంచి విలువ కట్టలేనిదయినా, పొరపాటు మాత్రం క్షమించలేనిది...నేను నిన్నేం మోసం చెయ్యను., చెయ్యలేను వెళ్ళు...''

"కాదు మీరు లేకపోతే నేను బ్రతకలేను...నిజం..."

"కల్పవల్లీ, నీలో ఆవేశం వొకటే కాదు–వెర్రికూడా వుంది...ప్రపంచంలో అన్నీ పోయిన్నాడు కూడా మనిషి మిగిలాడు...కానీ..,ఆయన మనిషి కాదు భగవంతుడంటావు..యెందరో కావలసిన వాళ్ళు పోయినా యెవరి బ్రతుకూ ఆగిపోదు...కొంచెం ఆలోచన; తృప్తి వుండాలి...క్షణికావేశానికి పెద్దపేరులు పెట్టి అనవసరంగా నువ్వు యేదిగా ననుకోకు...''

ఇంకా చెప్పబోయాడు రమణమూర్తి.

"చాల్లే...యిటువంటి కబుర్లు–కథలూ

యెప్పుడూ చెప్పకు. నాకు తెలుసు యిది నువ్వెందుకు చెబుతున్నావో. నన్ను ఫూల్ చెయ్యాలని నీవుద్దేశం..." అరచి లేచిపోయాడు ప్రభాకరం...

"ఆగు ప్రభాకరం - యిందులో నీ ప్రసక్తి యేం వుందని ... యెందుకలా వణికిపోతావు'' అన్నాను...

ప్రభాకరం నా మాటకూడా వినకుండా విసురుగా వెళ్ళిపోయాడు ... యేమిటని మూర్తిని అడగాలనుకునే లోపున 'వంటలయ్యాయి' లెమ్మని నలుగురు బంధువులు వచ్చారు...

సాయంకాలం ట్రయిన్‌కు మూర్తి హైదరాబాద్ వెడుతున్నాడు...అది చెప్పడానికే వచ్చాడు .... వుదయం నుంచీ ప్రభాకరమే గుర్తుకు వస్తున్నాడు..... యెంతైనా మిత్రుడు...

"అదేమిటిరా ప్రభాకరం అలా వెళ్ళిపోయాడు...వాడిపట్ల మనం సానుభూతి చూపాలనుకున్నాం తప్ప అవహేళన యేనాడూ చెయ్యాలనుకోలేదు కదా.''

వాడు నవ్వాడు..."అదేం లేదురా.. నేను నిజంగా చెప్తున్నాను...యిందాక నేను చెప్పిన కథ జరిగిందేరా...కానైతే అది నా అనుభవం కాదు..ప్రభాకరంది.. అందుకే...''

"ప్రభాకరందా...అసలేం జరిగింది.." అని అడగాలనుకునే లోపునే వాడు చెప్పాడు...

''కల్పవల్లి పెళ్ళి అయిన ఆర్నెల్లకే మరణించింది...కాదు ఆత్మహత్య చేసుకుని చనిపోయింది...!

"నిజం''...

మనవాడు కల్పవల్లి విషయంలో పూర్తిగా పొరపడ్డాడు. ఆమె ఆత్మవంచన చేసుకుందనీ - వట్టి ఆవేశానికి ప్రేమనే పేరు పెట్టిందని - నిందించాడు గానీ - తనలో నిద్ర పోతున్న నిజమైన ప్రేమ లేచి కూర్చుని పసిపిల్లాడిలా మారాంచేస్తున్నప్పుడు - ఆ రోదన విని పించనట్లు నటించాడు. శరీరాన్నీ కోరికలనీ మచ్చిక చేసుకోవడం మానేసి - బోనులో ఆహారంతగ్గించి పెడుతున్న సింహాన్నిలా లొంగదీసుకోవాలనుకున్నాడు.. కల్పవల్లిని తను ప్రేమిస్తున్నాననే విషయాన్ని గుర్తుకు తెచ్చుకోకుండా తన్ని తనే యిరుకుచేసుకొని నడిచేవాడు. పైగా తనని-తన నిజాయితినీ మామయ్య ముందు ప్రదర్శిస్తున్నాననుకొని - సుభద్రని పెళ్ళిచేసుకున్నాడు...

"అయితే...''

సుభద్ర బాగుండదనే విషయం మనందరికీ తెలిసిందే...ఆఖరికి సూరమ్మ గారూ కూడా యీ సంబంధానికి వప్పుకోవడంలో ఆత్మీయతకన్నా - పరిస్థితుల వత్తిడివల్లే ననే నిజం - ఆవిడకూ తెలుసు...

ప్రభాకరం కల్పవల్లిని తప్పు



"మీ చేతిలో ఈ రోజు కొంచెం నష్టం కనబడుతుంది."

అంచనా వేసుండచ్చు...ప్రతీవాళ్లూ నూటికి నూరుపాళ్లు జరగబోయేది వూహిస్తే ప్రపంచంలో చాలా అనర్థాలు తప్పిపోవచ్చు...ప్రేమించడానికీ-ప్రేమించిన వ్యక్తిని పొందడానికీ ప్రతివారికీ అవకాశం రాదు...సాధారణ పరిస్థితుల్లోనే అవసరాలు వికృతరూపం ధరిస్తోన్నప్పుడు-జీవితానుభవాల మజిలీ మొదటి పాదంలోనే ఆగిపోయిన ప్రభాకరం-తప్పు అంచనా వేసుకున్నంత మాత్రాన మనం విమర్శించాలా? మనిషిని లోతులకు వెళ్లి చదవాల్సింది వదిలి-నయనాల నీడల్లో మనం తెల్సుకోగల్గింది యెంత వుంటుంది... అదే అన్నాను... వాడు మళ్లీ నవ్వాడు. విషాదకరమైన సంగతులు విన్పించేముందు - బరువయిన బాధను వ్యక్తం చేసేటప్పుడు మూర్తి చేసే దరహాసం - వాడి వ్యక్తిత్వానికీ నిర్మలత్వానికీ చిహ్నం...విషాదాన్ని మనిషి సంపూర్తిగా లొంగదీసుకున్నవాడు ... ఆ మనిషిలోంచే నిండైన హాస్యం - హాసం పుడతాయి...

వాడు చెప్పాడు...నేను విన్నాను. నా కళ్ల వెంబడి రెండు కన్నీటి బిందువులు రాలి గాలిలో యింకిపోయేవరకు నేను అలాగే వుండిపోయాను...

* * *

యేడాది వరకూ ప్రభాకరం గురించి నాకేమీ తెలియలేదు...వుత్తరం వ్రాయాలన్నా- వాడు దాన్ని పరోక్షంగా వ్యతిరేక

భావంతో చిత్రించుకుంటాడనే అనుమానంతో ఆగిపోయాను.

ఆరోజు – యింటికి వచ్చేసరికి వాకిట్లో శారద యెవరితోనో మాట్లాడుతోంది... బెడ్‌రూమ్‌లోకి వెళ్ళబోయాను...

"యీవిడ మీకు గుర్తులేదా అంది'' శారదకంఠం...

చూశాను...లావుగా పొగచూరిన దీపంలా వుంది......నన్ను చూసి తల దించుకుంది...వొత్తు తగ్గిపోయిన జుట్టు పాయలుజారి తల భాగం కనిపిస్తోంది... వాటి మధ్య చంటి పిల్లవాడి 'స్ట్రెయిట్ లయిన్'లా పాపిడి...అదీ నల్లమట్టి మేటలు మధ్య నిరాశగా ప్రవహిస్తున్న నదీ పాయలా వుంది...అందాన్నీ, ఆకర్షణనీ నొక్కిపెట్టే చీర కట్టు... యిద్దరు కుర్రాళ్ళు ఆ కుచ్చెళ్ళచుట్టూ ఆడుకుంటున్నారు...అవును..ప్రభాకరం భార్య...సుభద్ర...యెందుకో నాకు కల్పవల్లి జ్ఞాపకం వచ్చింది చటుక్కున. యీ అమ్మాయి కోసం కల్పవల్లిని తిరస్కరించాడంటే చాలామంది ప్రభాకరాన్ని పూర్ క్రీచర్ అనొచ్చు...... అవును. త్యాగాలు చేసేముందు – చేసిన మనిషి యీ త్యాగానికి తగునా అనీ – లేకపోతే త్యాగానికి కర్త అయిన వాళ్ళని పరీక్షించి – యీ త్యాగానికి వీళ్ళు అర్హులేనా అని ఆపైన నిర్ణయాలు తీసుకోవడం చాలా మంది చేసేపనే...దానికి కారణం– చూసే కళ్ళల్లోనూ – స్పందించే మనసు పొరల్లోనూ వుంటుందంటే – అమాయకులు కూడా తెలివిగా నవ్వుతారు...... స్వీయానుభవంలో గాని రుచి తెలియన్ది – అంతుపట్టందీ త్యాగం వాకటే...

"కూర్చోండి ఫరవాలేదు" అంది శారద...వో కుర్రాడు వెళ్ళి టేబుల్ లాంపుతో ఆడుకుంటున్నాడు... మరొకడు టీపాయ్ యెక్కే ప్రయత్నంలో వున్నాడు...

"మా ప్రభాకరం కులాసాగా వున్నాడాండి...''

"మా అన్నయ్యగారు కూడా వస్తే బాగుండేది" అంది శారద.

లేదండీ...ఆయనకు తెలియదు నేనిక్కడకు వచ్చినట్టు...

సుభద్ర చెప్పిందంతా నేను వింటూన్నప్పుడుకన్నా – వినడం పూర్తి అయిన తరువాత – ఆవిడ వెళ్ళిపోయిన తరువాతే నా మెదడు పనిచేయడం మొదలుపెట్టింది...అందుకే నా మెదడు అవగాహన చేసుకున్న మాటల సమన్వయంలోనే నేను చెబుతున్నాను...సుభద్ర మాటలు గానీ – ఆ క్షణంలో ఆమెలో కదిలిన ఆవేదన – కళ్ళవెంబడి రాలిన కన్నీటి బరువుగానీ గుర్తు చేసుకుంటే నాకు నేనే అర్థంకాను...అందుకే నా మాటల్లో చెబుతున్నాను...

సుభద్రని కావాలని పెళ్ళి చేసుకు

న్నాడు ప్రభాకరం ... తల్లి సూరమ్మ గారూ - శర్మగారూ వెంటనే బుద్ధిమంతు డన్నారు ... ప్రభాకరం కాపురం పెట్టిన మూ డే ళ్ళ ల్లో యిద్దరు పిల్లల్నీ. వో యూ.డీ.సీ. ప్రమోషన్ సంపాదించాడు.

కానీ అతను సంపాదించలేన్ది - తన మీద నమ్మకం - భార్యకి యివ్వలేన్ది ప్రాముఖ్యం...యింకా ఆలోచిస్తే ప్రేమ. మొదటియేడాదిలోవున్న మమత - రఘు పుట్టడంతో అంతమయిందిట ... ఆ తరువాత రోజులో చాలా గంటలు ఆఫీసులోనూ - మిగిలిన కాలాన్ని చీట్ల పేకలమధ్యా గడిపేవాడు...

ప్రస్తుతం తల్లినీ-మామయ్యనీ కసురుకోవడం-భార్యకాబట్టి సుభద్రని చీటికీ మాటికీ కొట్టడం. అదీ చెయ్యడానికి విసుగనిపించినప్పుడు తలుపులు బిగించుకుని గదిలో కూర్చునేవాడు...ఆఫీసరు యేదో అంటే "నువ్వు చేసే పదవి కావాలంటే చాలా యీజీగా సంపాదించే వాణ్ణి ... బోడి వుద్యోగం" అన్నాట్ట. దాంతో మెమోలు, ఎక్స్ప్లనేషన్స్. వో రోజు సినిమాకువెళ్ళి హాల్లో యెవరో అమ్మాయిని చూసి భుజంమీద చెయ్యి వేశాట్ట. ఆమె తాలూకు వాళ్ళు గొడవ చేస్తే యీ అమ్మాయి పూర్వంలో నన్ను ప్రేమించింది ... కదూ అమ్మాయ్" అన్నాట్ట ... ఆఖరికి భర్త ప్రవర్తనా - తిట్లు తినలేక - సుభద్ర ప్రస్తుతం పుట్టింట్లోనే వుంటోందిట ...వుత్తరాలు వ్రాసినా జవాబివ్వడుట...

ఆలోచన్లు రేగుతున్న సమయంలో శారద వచ్చింది ... నా చూపుల్ని పసిగట్టింది...

"మీరోసారి ప్రభాకరాన్ని చూసి రాకూడదూ."

"చూసి నేనేం చెయ్యగల్ను..."

"అలా కాదు...వెళ్ళరండి... ప్రభాకరం మనందరికీ కావలసినవాడు.. పొరపాట్లు సహజం...వాటిని దిద్దుకోవాలంటే మనోస్థైర్యం యిచ్చే మిత్రుల అవసరం యెంతైనా కన్పిస్తుంది"...

వాడు జీవితంలో యెక్కడ తప్పటడుగు వేశాడో ఆలోచించాను ఆ రాత్రి.. నక్షత్రాల్ని తింటున్న మేఘపు పురుగులు...చందమామలోంచి జారిపోతున్న వెన్నెల జారు...

వాడికి నడక రాలేదు...కాళ్ళలో బలం లేకుండా వాడిచేత భగవంతుడు హర్డిల్స్ చేయించాడు...వొకేసారి - అన్పించింది...

* * *

"బాబూ."

"బాధపడకండి.. ... యిలా జరుగుతుందని యెప్పుడూ అనుకోలేదు..."

"వాడు యిష్టపడితేనే కదయ్యా చెప్పు.....బి. ఏ. లో జేర్పించింది.... సుభద్ర నిచ్చి పెళ్ళి చేసింది..బావపోయి నప్పటినుంచీ సంబంధం తెంపుకోలేక వీడేనా ఆధరు వవుతా డనుకుంటే ఆఖరికి నా కన్నే పొడిచాడు."

''నువ్వేం చేస్తావన్నయ్యా..యిదంతా నా దురదృష్టం...వాడికి చిన్నప్పటినుంచీ వొక్క సిల్కు లాగు కుట్టించలేదుట - నీకూ తెలుసుగా కాకీలాగు తప్ప తొడగ ననేవాడు...వొకటా బాబూ...''

ప్రభాకరం యింటిలో లేడు - వాడ్ని వెదుకులాడుతూ బయలుదేరాను.

ప్రభాకరం కృష్ణ వొడ్డున యిసుకలో కూర్చున్నాడు...చాలా మార్పు మానసికంగా వచ్చిందని అందరూ చెప్పిన దానికంటే బహిర్గతంగానే కన్పిస్తోంది...

"నువ్వా" అన్నాడు చేతిలో యిసుక దులిపేసుకుంటూ...

"ఏమిటిది..."

"ఏమిటి...''

"ఇదేమన్నా బావుందా...యిన్నియేళ్లు వచ్చి యిప్పుడిలా ప్రవర్తించడం యేం మర్యాద ... పెళ్ళాం-పిల్లలూ-నీకేమన్నా మంచనిపిస్తోందా...''

"మంచి..ఆ మాట నా దగ్గర చెప్పకు.. యీ మంచి పేరు చెప్పి - భయం పెట్టి నన్ను పెంచారు. నలుగురితో తిరిగితే మామయ్య తంతాడని భయం. నలగని బట్టలంటే భయం. నాకిష్టమైన చదువు, నాకు నచ్చిన మిత్రులు-ఆఖరికి భార్య - యేదీ పొందలేక పోయాను..నేను మంచి వాణ్ణి అంటావా...నాకు నేనే మంచివాణ్ణి కాలేనప్పుడు - వొకళ్ళకి మంచిగా వుండడం చెయ్యలేని పని...''

"చూడు ప్రభాకరం...మనకి కావల్సిందేమిటో నిర్ధారణగా తెలిసిన రోజు తెగించి దాన్ని సంపాదించుకోవాలి... ప్రయత్నంలో చాలా కష్టాలు – అంతకు మించిన సుఖాలూ వుంటాయి ... కానీ నీ సుఖాలపట్ల నీ కేనాడు విముఖతలేదు.. అలా వున్నరోజు నువ్వు 'సెయింట్'వి అయ్యే వాడివి......నీవాళ్ళంటే వాళ్ళ కన్నీళ్లు-కళ్లు అంటే నీకు భయం. ఒకళ్ళ కోసం త్యాగం చేస్తున్నాననుకుని ఆత్మని జోకొడుతూ మనసుని మాయచేశావు... నువ్వు త్యాగాలు చెయ్యడానికి తగిన అర్హత సంపాదించుకోకుండానే ఆ పదం పట్ల మోజుగా ప్రవర్తించావు .. క్షమించు. కనీసం కొన్ని త్యాగాలు అందుకున్న తరువాత-ఆ రుచి తెలిసిన తరువాత చేసిన త్యాగాలే మనిషిని పెంచుతాయి...

నీకు కావల్సినవి యేమిటో నాకు తెల్సు...అవి నీ కందలేదనీ తెల్సు... యింతకన్నా నువ్వారోజుల్లోనే అమ్మని కాదని హాస్టల్లోవున్నా-మామయ్య కుచ్చి

తాన్ని కనిపెట్టినా-యిష్టంలేని సుభద్రని పెళ్లిచేసుకోకుండావున్నా బావుండేది..''

''అవును...చాలా సార్లు కల్పవల్లి కన్పించింది...బ్రతుకులో నవ్వుతూ తిరుగుతున్న నువ్వూ. మూర్తి చాలా మంది కన్పించారు...నాలో అడుగు పొరల్లో నిద్రపోతున్న పాములు లేచాయి...కానీ పూర్వం అయితే అవి యెదటివాళ్లని కరచేవి కావు...నాతోనే ఆ కర్కశం ఆగిపోయేది...యిప్పుడు అందర్నీ కరవాలనీ...చెరపాలనీ..."

మధ్యస్తంగానే అనేశాను...వాడ్ని చూడలేక...మరి చదవలేక...

''ప్రభాకరం నాకెందుకో చెప్పాలని పిస్తోంది...గతంచేసిన పన్లు గాయాల్లా బాధిస్తూంటే భవిష్యత్ బాధాకరం చేసుకోవడం మంచిపనికాదు...పాతిక సంవత్సరాల్లో నువ్వు నిండుగా నవ్వగల్గావా...పోనీ నిండుగా నవ్విన స్వరంలో లోతుల్ని చదివేవా...ఆలోచించు... శాపానికి వో హద్దు వుంటుంది... అది తీరిపోయిన రోజునే యిలాంటి మగత కలుగుతుంది ... వెడతాను...''అన్నాను.

రైలు అరుస్తుంటే బెర్త్ మీద ముసిలాయన నిద్రలో నవ్వుతుంటే...సీటు మీద కూర్చున్న లేత వయసులో వున్న బాల వితంతువు మగతలో తడిబారిన నయనాలు చూస్తుంటే - యీ మిశ్రమ భావాల అలజడిలో అన్పించింది...

ఓ మనిషిలో సంతోషపు రేఖ జారి పడిందంటే అది వట్టినే నేలపాలవదు... మరో మనిషికి దొరుకుతుంది ...ఆనందించాల్సిన అవయవాలు - నవ్వవలసిన పెదవులు నిస్పృహ నావరిస్తే ఆ హాసం మరెవరి పరమో అవుతుంది...అందుకే నవ్వేవాళ్లకి సమానంగా కన్నీరు కార్చేవాళ్లని, దుఃఖితులకు రెట్టింపు ఆనంద జీవుల్ని మనం చూడాల్సి వుంటుంది... చూస్తాం.

